# దేవాలయ భూములు దళితులకే దక్కాలి

కె. బాలగోపాల్

మనది భక్తిరసం మెండుగా పారే రాష్ట్రం కాబట్టి ఇక్కడ గుళ్ళెక్కువ ఉన్నాయి. ఆగుళ్ళ (వాటి పూజారుల) పోషణార్థం దానమిచ్చిన భూములే ఎక్కువ ఉన్నాయి. దాదాపు మూడున్నర లక్షల ఎకరాల 'దేవాదాయ' భూములు రాష్ట్రంలో ఉన్నాయని అంచనా.

దేవదాయ భూమి అంటే దేవునికి ఆదాయం ఇచ్చేదని అర్థం. గుళ్ళలో జరిగే వివిధ కార్యకలాపాలకు గుడిపూజారి మనుగడకు ఒక ఆదాయ మార్గం అవసరమని భావించిన పూర్వ కాలపు రాజులు దానం ఇచ్చిన భూములు ఇవన్నీ. ఇటువంటి పుణ్య కార్యానికి పోరంబోకు భూములు బంజర్లు ఎవరూ ఇవ్వరు కాబట్టి ఈ దేవాదాయ భూములు ఎక్కువగా సారవంతమైనవని వేరే చెప్పనవసరం లేదు.

అయితే ఈ దేవాదాయ భూముల నిర్వహణ మొదటి నుండి అసమర్థంగానే ఉంటూ వచ్చింది. దానిని కౌలుకు తీసుకున్నవారు స్వంతానికి వాడుకోవడం, అమ్ముకోవడం, వారసుల కోసం చేసుకోవడం బిడ్డ పెండ్లికి పసుపు కుంకుమగా ఇచ్చేసుకోవడం జరిగింది. గుళ్లకు ఆ భూముల వల్ల వచ్చిన ఆదాయం చాలా తక్కువ.

పూర్వకాలపు పాలకులిచ్చిన ఈనాంలో జమిందారులూ, జాగీరులూ అన్నీ రద్దయిపోగా ఈ దేవుడి మాన్యాలు మాత్రం ఎందుకు కొనసాగాలి అన్న విమర్శ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఉండింది. ధైర్యం చేసి అనలేక పోయారు గానీ, భక్తులిచ్చే విరాళాలతో నడవలేని గుడిని భూములిచ్చి నిలబెట్టవలసిన అవసరం ఏముంది ? ఆ మాత్రం ప్రజాదరణ లేని దేవుడికి గుడి ఎందుకు?

ఈ మాటలు వాడకపోయినా దేవాదాయ భూములు పేదలకు పంచాలి అన్న నినాదం కమ్యూనిస్టు పార్టీలు చాలా కాలంగా ఇస్తుండేవి. మరి గుడి ఎట్లా నడవాలి భక్తులు ఆవేశపడితే, ప్రభుత్వాన్నే నిధులిచ్చి నడపమనండి అని జవాబు చేప్పేవారు. దేవుడి మాన్యాలు సెక్యులర్ ప్రయోజనాల కోసం ముట్టుకోరానంత పవిత్రమైన వేం కావనీ, మాన్యాలు రద్దుచేసి డబ్బులిస్తే అది రాజ్యాంగ విరుద్ధమేం కాదని సుప్రీంకోర్టు 1950లోనే ఒక తీర్పులో అనింది.

అయినప్పటికీ దేవుడి 'సెంటిమెంట్' అంటే భయపడి ఈ పనిచేయడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదు. తానే దేవుడి అవతారం అని భావించిన ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాతే దేవాదాయ ధర్మాదాయాలు చట్టాన్ని ఈ మేరకు సవరించే ప్రయత్నం జరిగింది. ఎన్టీఆర్, చల్లా కొండయ్య అనే రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని (వీరు కూడ కమ్మవారే కావడం విశేషం) ఏక సభ్య కమీషన్‌గా నియమించి, మొత్తంగానే దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని సంస్కరించడానికి సూచనలిమ్మని కోరారు. చల్లా కొండయ్య గారి సూచనలు బ్రాహ్మణులకు చాలా కోపం తెప్పించినప్పటికీ అవి దేవాలయాల నిర్వహణను చక్కదిద్దడానికి ఉపయోగపడిన మాట వాస్తవం.

వారి సూచనలననుసరించి 1987లో రాష్ట్ర అసెంబ్లీ దేవాదాయ చట్టాన్ని సమగ్రంగా సవరించింది. సవరించిన చట్టంలోని సెక్షన్ 82, దేవుని మాన్యం భూములలోని అన్ని కౌలుదారి హక్కులను రద్దుచేసింది. అంటే ఎప్పుడో వాటిని కౌలుకు తీసుకొని వంశపారంపర్యంగా అనుభవిస్తున్న వారందరి హక్కులూ రద్దయిపోయాయి. అయితే వారిలోని పేదవారి హక్కులను మాత్రం సెక్షన్ 82(2) కాపాడింది. స్వంత భూమి దేవుని మాన్యంలోని కౌలు భూమి కలుపుకొని $2^{1/2}$ ఎకరాలు మాగాణి లేక 5 ఎకరాలు మెట్టమించి లేని వారిని ఈ చట్టం 'భూమిలేని కౌలుదార్లు' అంటుంది. అటువంటి కౌలుదార్లకు వారు కౌలుకు చేస్తున్న దేవుడి మాన్యం భూమిని 75శాతం మార్కెట్ ధరకు ప్రభుత్వం నుండి కొనుక్కొనే హక్కు సెక్షన్ 82(2) కల్పించింది. తక్కిన దేవాదాయ భూమిలోని అన్ని హక్కులూ రద్దయిపోయి అవి ప్రభుత్వం పరం అయ్యాయి.

ప్రగతిశీలమైన ఈ చట్ట సవరణను బడా కౌలుదార్లు హైకోర్టులో సవాలు చేసారు. దేవాదాయాలకు అన్యాయం జరిగిపోతుందనీ, గుళ్ళు పాతబడిపోతాయనీ గొడవపెట్టారు. దేవాలయాలను మూతవేసే ఉద్దేశ్యం తనకేమీ లేదనీ వాటి మాన్యాలు రద్దుచేసినా వాటి నిర్వహణకు అవసరం అయిన నిధులు ఏర్పాటు జరుగుతుందనీ ప్రభుత్వం హామీ యిచ్చినప్పటికీ హైకోర్టు సంతృప్తి చెందలేదు. భూ సంస్కరణను నీరు కార్చే అనేక తీర్పులిచ్చిన కోర్టు సెక్షన్ 82 విషయం లోను అదే పని చేసింది. ఆ సెక్షన్ రాజ్యాంగ విరుద్ధం అని కొట్టేసింది. 1990లో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు మన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పుడే అప్పీలు వేసింది. వేసి నిద్రపోయింది. అది 2003లో విచారణకు వచ్చింది. (ఎంత పాతకేసయినా ఏదో ఒకరోజు విచారణకు రాకతప్పదు కాబట్టి) సుప్రీంకోర్టు రాష్ట్ర హైకోర్టును తిరగదోడి దేవాదాయ చట్టంలోని సెక్షన్ 82 రాజ్యాంగబద్ధమేనని ప్రకటించింది.

దీని ఫలితంగా ఇప్పుడు దాదాపు మూడున్నర లక్షల ఎకరాల దేవుడి మాన్యం భూములలోని అన్ని హక్కులూ రద్దయిపోయి అవన్నీ ప్రభుత్వ పరం అయ్యాయి. అందులో భూమి లేని పేదలు కౌలుకు చేస్తున్న భూమిని వారికే ప్రభుత్వం మార్కెట్ ధరలో 75శాతానికి సెక్షన్ 82(2) ప్రకారం అమ్మవలసి ఉంటుంది. ఇది దాదాపు ఒక లక్ష ఎకరాలు ఉంటుందని అంచనా. తక్కిన రెండున్నర లక్షల ఎకరాల భూమి ఇప్పుడు ప్రభుత్వం అజమాయిషీలో ఉంది.

ఆ భూమి పేదలకు, అందులోనూ, ప్రధానంగా ఎస్.సి, ఎస్.టి లకు దక్కేటట్లు చూడవలసిన కర్తవ్యం ప్రజా ఉద్యమాల పైన ఉంది. సెక్షన్ 82ను చట్టాలలో పెట్టినప్పుడు ప్రభుత్వం ఉద్దేశ్యం ఏముందో గానీ అది రాజ్యాంగబద్ధమే నని సుప్రీంకోర్టు ప్రకటించేసరికి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. ఈ ప్రభుత్వం వెంటనే ఆ భూమినంతా వేలంపాటలో అత్యధిక మొత్తానికి మళ్ళీ కౌలుకు ఇచ్చే ప్రయత్నాన్నీ మొదలుపెట్టింది. అయితే ఈసారి కౌలుదార్లు శాశ్వతంగా కొనసాగకుండా పరిమిత కాలానికే కౌలుకిస్తామంటున్నారు.

ఇది కొనసాగితే మళ్ళీ దేవుడి మాన్యాలన్నీ ధనవంతుల పరం అవుతాయి. చంద్రబాబు వ్యవసాయ విధాన నీతిని అనుసరించి రాబోయే రోజులలో ఆ భూములలో రొయ్యల చెరువులు, ఎగుమతి బ్రాండ్ పూదోటలూ వెలుస్తాయి. ఈ వేలం పాటను ఇప్పటికే ఎక్కడికక్కడ కమ్యూనిస్టు పార్టీలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అడ్డుకుంటున్నాయి. అయితే అన్ని సంఘాలూ ఒకే తాటి మీద కొచ్చి ఎదుర్కొనడం అవసరం.

ఈ భూమినంతా ఇతరత్రా భూమి లేని పేదలకు, అందులో ప్రధానంగా, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వాలన్న నినాదంతో ఐక్య ఉద్యమం నడవాలి. ఉచితంగా ఇమ్మంటే ఇచ్చే రోజులు కావు కాబట్టి మార్కెట్ ధరలో ఏ 75శాతానికో లేక 50 శాతానికో ఇవ్వాలని వెంటనే చెల్లించలేని వారికి ఎస్‌సి కార్పొరేషన్ అప్పు ఇవ్వాలని అసలే చెల్లించలేని వారిని గుర్తించి ఎస్‌సి కార్పొరేషన్ ఆ భూములు కొని వారికివ్వాలనీ డిమాండ్ చేయాలి.

ఆచరణలో ఎన్నో సమస్యలుండవచ్చును. ఉదాహరణకు పెద్ద కౌలుదార్ల పేరుమీద ఉన్న దేవుని మాన్యం భూములను ఏనాడో వారి దగ్గర ఇతరత్రా భూమిలేని వారు కొనుక్కొని చేసుకుంటూ ఉండవచ్చు. లేదా కుటుంబం పెద్దదయి పంపకాలు చేసుకున్న కారణంగా అనుభవదారులయిన వారు చిన్న రైతులై పోయి ఉండవచ్చు. చట్టం నిర్వచనంలో 'భూమిలేని' వారయిపోయి ఉండవచ్చును కూడ! వీళ్ళ హక్కులను గుర్తించాలని కోరుతున్న పార్టీలున్నాయి. వీరిలో యోగ్యులు అయోగ్యులు అన్న విచక్షణ పాటించాలని భావించే వారూ ఉన్నారు.

ఇటువంటి సమస్యలెన్ని ఉన్నా సూత్రప్రాయంగా దేవుడి మాన్యాలు పేదలకు అందులో ప్రధానంగా ఎస్‌సి, ఎస్.టిలకు దక్కాలన్న నినాదంతో బలమైన ఉద్యమం నిర్మించడం అవసరం. పుణ్యకాలం గడిచిపోయే లోపల చేయడం అవసరం.

కర్నాటకలో ఎస్.సి.ల వర్గీకరణ ఆందోళన ( 21వ పేజీ తరువాయి )

ప్రభుత్వం రాత్రికి రాత్రే కమిషన్‌కు అధ్యక్షున్ని నియమించి ఆదేశాన్ని జారీ చేసింది. ఎన్నో కష్టనష్టాలతో నిరంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని స్తంభింపచేసేటటువంటి ఉద్యమాలను నిర్మించిన మాదిగలు పోరాటాల వలననే ప్రభుత్వాన్ని లొంగ తీసుకుంది. ఇప్పుడు కూడా మమ్మల్ని గురించి మేము గొప్పగా చెప్పుకోవడం లేదు. ప్రభుత్వం వర్గీకరణ ధ్వనులను ఉద్దేశ పూరితంగా నియంత్రించడానికి చేయాల్సిన అన్ని తెరవెనుకటి ప్రయత్నాలనూ, నియంత్రించడానికి చేయగల్గిన సర్కాస్‌ఫీట్లను మరువడం లేదు. ఒక వైపు కమీషన్‌కు అధ్యక్షున్ని నియమించిన వెంటనే మరో వైపు " KRPSC" (కర్నాటక పబ్లిక్ సర్వీస్ కమీషన్) సభ్యులుగా, MLC స్థానానికి తాను ఏమి చేయాలనుకుందో అదిచేసి ప్రభుత్వం తన విభజించి పాలించే నీతిని పాటించడలో వెనుకంజ వేయదనేది చూపించింది. అందువల్ల మాదిగ సంఘాలూ, మాదిగ మేధావులూ ప్రభుత్వానికి వర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయమని ఒత్తిడి చేయడమే గాక, రాష్ట్రంలోని మూలమూలలా నిష్పక్షపాతంగా జనాభాను లెక్కించే విధంగా నిఘా వహించటం ద్వారా మరొకసారి మే మెక్కువ, మే మెక్కువ' అంటూ పోట్లాడుకునే పరంపరకు ముగింపు పలికి, శాస్త్రీయ పరిష్కారం ద్వారా చీలిపోయిన మనస్సులను ఐక్యపరచి, ఉద్రేక వాతావరణాన్ని చల్లబరిచే చారిత్రాత్మక పోరాటానికి పునాదుల వేయాల్సి వుంది.

ఇటువంటి బాధ్యతలు మన మీద వున్నప్పుడు మరోవైపు 1971 జనాభా లెక్కల ప్రకారం తయారయిన ఎల్.జి. హావనూరు రిపోర్ట్‌ను యథాతథంగా అమలు చేయాల్సిందిగా కొన్నిసంఘాలు ప్రజలను తప్పుతోవ పట్టించే తీవ్ర ప్రయత్నాలలోమునిగి వుండటాన్ని ప్రజలందరూ తిరస్కరించాల్సి వుంది. ఎల్.జి. హావనూర్ రిపోర్ట్ జనసంఖ్య లెక్కలు తప్పితే మరేమీ మనకు ఉపయోగపడే అంశాలు స్పష్టంగా లేనందున మరొకసారి కమిషన్ ఏర్పాటయి తిరిగి అధ్యయాన్ని ఆరంభించాల్సి వుంది. ఈ అన్ని ప్రయత్నాల వెనుక మనమందరం సంఘటితం గా నిలబడి పని చేయాల్సి వుంది. మన కులం పేరుతో ఎన్నికయిన మాదిగ రాజకీయ నాయకులు ఏ విధంగానూ మనకుల అభ్యున్నతికి కొద్దిగా కూడా శ్రమ వహించకుండా పార్టీకి స్వామి భక్తితో సేవ చేస్తూ, తన్మయత్వంతో ఉద్యమానికి వ్యతిరేకంగా విశ్వాసఘాతక చర్యలకు పాల్పడుతున్నారు. ఇక ప్రతిపక్షాలలోని మాదిగ నాయకులు దీనికి ఏ మాత్రం భిన్నంగా లేకుండా ఎక్కడ మాదిగేతర ఓట్లు తమ చేజారి పోతాయే అన్నట్లు విషపూరిత లెక్కలలో మునిగి పోయినారు. ఇక మాదిగ కులానికి చెందిన ఉన్నతస్థాయి అధికార వర్గము ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోవటంలో కొద్దిగా కూడా సహకరించ కుండా రాజకీయ నాయకుల గులాములుగా మారి తమ సొంత ప్రయోజనాలకై తమ కాలాన్ని తెలివిని బలి చేసుకున్నారు.

ఇటువంటి ఎన్నో ఆటంకాల నడుమ మాదిగ ప్రజల ఆశా కిరణంగా నిస్వార్థ ఉద్యమకారులు మరింత జాగరూకతతో తమపై ప్రజలు ఉంచినటు వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సి వుంది. ఈ విధంగానే రిజర్వేషన్లు పంచుకోవడం, రక్షించుకోవడం కోసం నిరంతరంగా పోరాడుతూ మన శత్రువు లయిన కులతత్వం, మతతత్వం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ వంటి పెనుభూతాలకు వ్యతిరేకంగా అంతిమ పోరాటానికి సిద్ధమయ్యి దళితుల సర్వముఖాభివృద్ధికి సమయాన్ని, మరియు సామర్థ్యాన్ని పొందుదాము. ★